సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 15 । జూన్ । 2025



సంధ్య వేళ అయింది ఇక వెళ్లొస్తా అంటూ భానుడు బై బై చెబుతుంటే.. అరుణవర్ణంలోకి మారిన ఆకాశాన్ని నీలి మబ్బులు కమ్మేస్తూ వెళ్లిరా నేస్తం అంటూ సాగనంపుతున్నట్లు అద్భుతంగా కనిపిస్తుంది కదూ! అంబికాబాగ్ రామాలయం వద్ద శనివారం సాయంత్రం ఈ సుందర దృశ్యం ఆవిష్కృతమైంది.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

న్యూస్‌రీల్

మోకాలి గాయాలపై నేడు సదస్సు



బ్రోచర్ విడుదల చేస్తున్న కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కిమ్స్ ఆస్పత్రి(సీతమ్మధార), ఉత్తరాంధ్ర ఆర్థోపెడిక్ అసోసియేషన్, వైజాగ్ ఆర్థోస్కోపిక్ అసోసియేషన్ సంయుక్తంగా ఆదివారం ఫోర్ పాయింట్స్ షెరటాన్ హోటల్‌లో మోకాలి గాయాలపై ఒక రోజు సదస్సు నిర్వహిస్తున్నట్లు కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శివానంద్ తెలిపారు. ఉత్తరాంధ్రకు చెందిన 150 మంది ఆర్థోపెడిక్ వైద్యులు హాజరయ్యే ఈ సదస్సులో, రోడ్డు ప్రమాదాలు, క్రీడల వల్ల కలిగే మోకాలి లిగమెంట్లు, మెనిస్కస్ గాయాలపై చర్చిస్తారు. వీటికి ఆర్థోస్కోపీ వంటి ఆధునిక శస్త్రచికిత్సల ద్వారా ఎలా చికిత్స అందించవచ్చో అహ్మదాబాద్, కోయంబత్తూరు వంటి నగరాల నుంచి వచ్చిన నిపుణులు వివరిస్తారు. సకాలంలో చికిత్స తీసుకోకపోతే ఇలాంటి గాయాలు దీర్ఘకాలంలో కీళ్ల అరుగుదలకు దారి తీస్తాయని, ఈ విషయంపై వైద్యులకు, ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

రేపు సీఎం విశాఖ రాక

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 16న విశాఖ రానున్నారు. విజయవాడ నుంచి ఉదయం 10.40 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా వెళ్లి ఆర్కే బీచ్, కాళీ మాత దేవాలయం, పార్కు హోటల్ జంక్షన్, ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్ తదితర ప్రాంతాలను పరిశీలన చేస్తారు. 12.15 గంటలకు నోవోటెల్‌కు చేరుకొని అక్కడ సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు పీఎం పాలెం వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ కేడర్‌తో సమావేశమవుతారు. సాయంత్రం 5.35 గంటలకు విమానంలో విజయవాడ బయలుదేరుతారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

మహారాణిపేట: జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆదివారం విశాఖ రానున్నారు. రాత్రి ఇక్కడ బస చేస్తారు. 16న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు నగరంలో పర్యటనలు, సమీక్షల్లో పాల్గొంటారు.

కొనసాగుతున్న విమ్స్ వైద్యుల నిరసన

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కాంట్రాక్ట్ వైద్యుల నిరసన మూడో రోజు శనివారం కొనసాగింది. వైద్యులంతా నల్ల బ్యాడ్జిలు ధరించి వేతనాలు పెంచాలని నినాదాలు చేశారు. ఉద్యోగంలో చేరి మూడేళ్లు గడుస్తున్నా వేతనాలు పెంచలేదని, వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకటించినంత వరకు నిరసన కొనసాగిస్తామని తెలిపారు.

సమాచార శాఖ ఉప సంచాలకులుగా రమేష్



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీ రమేష్

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖ ఉప సంచాలకులుగా డి.రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు విజయనగరంలో ఏడీగా సేవలందించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జేసీ కె.మయూర్ అశోక్‌లను వారి చాంబర్లలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అలాగే సమాచార పౌర సంబంధాల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో బాధ్యతలు నిర్వర్తించిన ఎస్.వి.రమణ అనకాపల్లి బదిలీపై వెళ్లారు.

క్యాన్సర్‌కు కళ్లెం



విశాఖలో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్ యూనిట్

- హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో బ్లాక్
- ఎనిమిది అంతస్తుల్లో 3.9 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు
- 2027 నాటికి అందుబాటులోకి అత్యుత్తమ, అధునాతన వైద్య సేవలు
- టాటా మెమోరియల్ సెంటర్‌కు ఐసీఐసీఐ బ్యాంక్ రూ.550 కోట్లు విరాళం
- ఇంటెన్సివ్ కీమో, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, అధునాతన రేడియేషన్‌థెరపీ ఇలా మరెన్నో..

విశాఖ సిటీ: క్యాన్సర్ కర్కశమైనది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ కబళిస్తోంది. అటువంటి మహమ్మారి పీచమనచడానికి విశాఖలో అడ్వాన్స్ డ్ క్యాన్సర్ కేర్ బ్లాక్ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఉత్తరాంధ్ర, ఒడిశా రాష్ట్రాల క్యాన్సర్ బాధితులకు వైద్య సేవలు అందిస్తున్న అగనంపూడి ప్రాంతంలో ఉన్న హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్(హెచ్‌బీసీహెచ్‌ఆర్‌సీ)లో నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తూర్పు భారత దేశంలోనే అత్యుత్తమ స్పెషలైజ్డ్ క్యాన్సర్ చికిత్సా కేంద్రాల్లో ఒకటిగా నిలిచేలా దీన్ని తీర్చిదిద్దనున్నారు. ప్రధానంగా పీడియాట్రిక్, హెమటోలింఫాయిడ్(శిశు, రక్త) క్యాన్సర్ల చికిత్స, పరిశోధనలకు సంబంధించి అతి పెద్ద కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు.

క్యాన్సర్ రోగులకు అనేక సేవలు

ఈ కొత్త బ్లాక్ ద్వారా క్యాన్సర్ రోగులకు అనేక వైద్య సేవలు అందనున్నాయి. ఇందులో ఇంటెన్సివ్ కీమోథెరపీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, అధునాతన రేడియేషన్ థెరపీ, కార్ టీ-సెల్ థెరపీ లాంటి అధునాతన ఇమ్యునోథెరపీలు, మూడు లీనియర్ యాక్సిలరేటర్లు, ఎంఆర్‌ఐ, సీటీ అండ్ పెట్ స్కాన్లతో పాటు అత్యంత ఆధునిక మెడికల్ ఇమేజింగ్, డయాగ్నోస్టిక్స్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అలాగే ఇందులో 14 బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ గదులు, 14 ఐసీయూలు, 5 ఆపరేటింగ్ థియేటర్లు, పరిశోధనల కోసం ప్రయోగశాలలు, చికిత్స ప్లానింగ్, శిక్షణ కోసం జాయింట్ డిస్కషన్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. పీడియాట్రిక్, హెమటోలింఫాయిడ్ క్యాన్సర్లకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స, బ్లడ్ సెంటర్, పౌష్టికాహారం, పునరావాసం లాంటి సేవలు అందనున్నాయి.

ఏటా 3 వేల మందికి చికిత్స అందించేలా..

ఐసీఐసీఐ ఫౌండేషన్ బ్లాక్ ఫర్ చైల్డ్ అండ్ బ్లడ్ క్యాన్సర్ భవనాన్ని 8 అంతస్తుల్లో సుమారు 3.9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఈ కొత్త భవనంలో 555 పడకలు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం అగనంపూడిలో ఉన్న హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో గత మూడేళ్లుగా రోజూ కొత్తగా సుమారు 200 మంది పీడియాట్రిక్ క్యాన్సర్ రోగులు, 350–400 మంది హెమటోలింఫాయిడ్ క్యాన్సర్ పేషంట్లు వైద్య సేవలు పొందుతున్నారు. కొత్త బ్లాక్ అందుబాటులోకి వచ్చిన తర్వాత బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో పాటు ప్రస్తుత వైద్య సేవలను గణనీయంగా విస్తరించేందుకు, అలాగే ఇమ్యునోథెరపీకి వెసులుబాటు కలగనుంది. మరో 3 వేల మంది క్యాన్సర్ రోగులకు చికిత్స అందించే అవకాశం ఉంటుంది. ఈ కొత్త బ్లాక్‌ల్లో అధునాతన వైద్య సదుపాయాలు, పరిశోధన విభాగాలు ఉండనున్నాయి. పెరుగుతున్న క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 2027 నాటికి ఈ కొత్త బ్లాక్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఉన్నారు.



టీఎంసీకి ఐసీఐసీఐ రూ.550 కోట్లు విరాళం

ఈ భారీ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ఐసీఐసీఐ బ్యాంక్ భారీ విరాళాన్ని టాటా మెమోరియల్ సెంటర్(టీఎంసీ)కు ప్రకటించింది. బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులు రూ.550 కోట్లతో ఈ అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్‌ని నిర్మిస్తోంది. దేశంలో క్యాన్సర్ కేర్‌కు సంబంధించి విశాఖ, నవీ ముంబై, న్యూ చండీగఢ్‌లో కొత్తగా మూడు టీఎంసీ కేంద్రాల ఏర్పాటుకు ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1,800 కోట్లు విరాళం ఇస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో రూ.550 కోట్లతో విశాఖలో శిశు, రక్త క్యాన్సర్ చికిత్సకు తూర్పు దేశంలోనే అతిపెద్ద అత్యుత్తమ మెడికల్ టెక్నాలజీతో అధునాతన ఆస్పత్రి నిర్మాణానికి పూనుకున్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఐసీఐసీఐ బ్యాంక్ చైర్మన్ ప్రదీప్ కుమార్ సిన్హా(ఫైల్)

యోగాంధ్రలో భాగస్వాములుకండి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21వ తేదీన నగరంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొనే యోగా కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామిక సంస్థలు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆయా సంస్థల నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు, విద్యా సంస్థల్లోని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. నగరంలోని కేంద్ర ప్రభుత్వ, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో యోగాంధ్ర కార్యక్రమంపై శనివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. తమ సంస్థల తరఫున యోగా దినోత్సవంలో ఎంతమంది, ఏయే ప్రదేశాల్లో పాల్గొంటారనే సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి అందజేయాలని కోరారు. తమ సంస్థల ఆవరణ, అందుబాటులో ఉన్న ప్రదేశాల్లో యోగా దినోత్సవం నిర్వహిస్తున్నామని పోర్టు ట్రస్టు, స్టీల్ ప్లాంట్, హెచ్‌పీసీఎల్, కోరమాండల్, దివీస్, ఐబీఎం, రైల్వే ప్రతినిధులు తెలిపారు. యోగా దినోత్సవంలో పాల్గొనే వారందరికీ టీ షర్టులు, మేట్లు జిల్లా యంత్రాంగం తరఫున అందజేస్తామని కలెక్టర్ చెప్పారు. బీచ్ రోడ్డులోని రెస్టారెంట్లు, హోటళ్ల యాజమాన్యాలతో మాట్లాడి యోగా దినోత్సవం రోజు ప్రజలు మరుగుదొడ్లు వినియోగించేందుకు అనుమతించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వాణిజ్య పన్నులు, ఆహార భద్రత శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే అవసరమైన సమాచారం అందజేసేందుకు సాగరిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 0891-2942015, 2942040, 2942044, 2942055 నెంబర్లకు ఫోన్ చేస్తే సమాచారం అందజేస్తారని పేర్కొన్నారు.

క్రమశిక్షణతో వృత్తిలో రాణింపు

జస్టిస్ చీమలపాటి రవి

సబ్బవరం: న్యాయవాదులు తమ వృత్తిలో రాణించాలంటే క్రమశిక్షణతో కూడిన సాధనతో పాటు ఎంతో ఓపిక, సహనం అవసరమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర బార్ కౌన్సిల్, వర్సిటీ సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఓరియంటేషన్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వృత్తిలో నీతి, నైతిక విలువలు ఎంతో అవసరమన్నారు. సాధనపై దృష్టి కేంద్రీకరించి భవిష్యత్‌లో రాణించాలన్నారు. న్యాయవాదులంతా ముందుగా చట్టాన్ని పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. సీనియర్ న్యాయవాదులను కలుస్తూ వారి సలహాలు, సూచనలు తీసుకుని సాధన చేయడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, వర్సిటీ ఉపకులపతి ఆచార్య డాక్టర్ డి.సూర్యప్రకాశరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సిరపరపు కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ ఆలూరి రామిరెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, రాష్ట్ర బార్ కౌన్సిల్ విశాఖపట్నం సభ్యులు పి. నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవిని జ్ఞాపికతో సత్కరిస్తున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

మురళీనగర్: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి పాలిసెట్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా పాలిసెట్ కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతుంది. పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి 27వ తేదీలోగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓసీ/బీసీలు రూ.700 ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలి. కౌన్సెలింగ్/సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు జరుగుతుంది. విద్యార్థులు తమ సమీప హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లి సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు రసీదు, పాలిసెట్ హాల్‌టికెట్, పాలిసెట్ ర్యాంకు కార్డు, పదో తరగతి లేదా దానికి సమానమైన మార్కుల మెమో, 4–10 తరగతుల స్టడీ సర్టిఫికెట్ తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. విశాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నగరంలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్), పెందుర్తి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వివరాలకు https://polycet.ap.gov.inలో చూడవచ్చు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పెట్టుకోవచ్చు. జూలై 1 నుంచి ఆప్షన్లు మార్చుకోవచ్చు. జూలై 3వ తేదీన సీట్లు కేటాయిస్తారని కన్వీనర్ డాక్టర్ నారాయణరావు తెలిపారు.

హజ్ యాత్రికులకు కూటమి వెన్నుపోటు

రాష్ట్ర హజ్ కమిటీ మాజీ సభ్యుడు మహ్మద్ ఇమ్రాన్

సాక్షి, విశాఖపట్నం: కూటమి అధికారంలోకి వస్తే హజ్‌యాత్రకు వెళ్లే వారికి రూ. లక్ష ఇస్తానని చెప్పిన చంద్రబాబు.. అధికారం చేపట్టిన ఏడాది కాకముందే వెన్నుపోటు పొడిచారని రాష్ట్ర హజ్ కమిటీ మాజీ సభ్యుడు, కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. ఎన్నికల సమయంలో విజయవాడ నుంచి వెళ్లే వాళ్లకు మాత్రమే రూ.లక్ష ఇస్తామని ఎక్కడా చెప్పలేదని.. ఇప్పుడు మాట మార్చటం తగదన్నారు. శనివారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.14.04 కోట్లు కేటాయిస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపుగా 1,797 మంది హజ్ యాత్రీకులకు రావాల్సిన రూ.9.40 లక్షల బిల్లు సీఎంఎఫ్ పెండింగ్‌లో పెట్టేసిందన్నారు. 2025 హజ్ యాత్ర అప్లికేషన్ ప్రక్రియ ప్రారంభమైనప్పుడైనా విజయవాడ నుంచి వెళ్లే యాత్రికులకు మాత్రమే రూ.లక్ష ఇస్తామని ఎందుకు చెప్పలేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ నుంచి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నాక మైనారిటీ మంత్రి మేల్కొని, విజయవాడ నుంచి వెళ్లే వారికి మాత్రమే రూ.లక్ష ఇస్తామనడం దారుణమన్నారు. ఇంతా చేస్తే విజయవాడ నుంచి దరఖాస్తు చేసుకున్న వారు 101 మంది మాత్రమే.. ఇదేమాట యాత్ర ప్రక్రియ ప్రారంభమైనప్పుడు చెప్పి ఉంటే అందరూ విజయవాడ నుంచే పెట్టుకునేవారన్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక రూ.9 కోట్లు, తెలంగాణ రూ.3 కోట్లు కేటాయించగా.. ఏపీలో ఒక్క పైసా కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో 2,873 మంది హాజీలకు రూ.19.52 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. హజ్ క్యాంపు ఖర్చుల కోసం దాదాపు రూ. 2 కోట్ల విడుదల చేసిన ఘనత అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే చెల్లిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నేతలు భర్కత్ అలీ, జహీర్ అహ్మద్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర హజ్ కమిటీ మాజీ సభ్యులు మహ్మద్ ఇమ్రాన్

జూలై 19న కో–ఆపరేటివ్ బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలు

మహారాణిపేట: ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (మల్టీ స్టేట్) పాలకవర్గం ఎన్నికలు వచ్చే నెల 19న నిర్వహించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈనెల 17న విడుదల చేయనున్నట్లు కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు.

వేకువజాము వరకు ఎస్జీటీల కౌన్సెలింగ్?

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ బదిలీల కౌన్సెలింగ్ శనివారం అర్ధరాత్రి దాటినా కొనసాగుతోంది. మొత్తం 2,782 మంది బదిలీ కోసం దరఖాస్తు చూసుకోగా శుక్రవారం నాటికి 1,600 మందికి కౌన్సెలింగ్ పూర్తయింది. శనివారంతో కౌన్సెలింగ్ ముగించాలనే ఆలోచనతో విద్యా శాఖాధికారులు బదిలీ జాబితాలో 1,601 నుంచి ఆఖరి నంబర్ వరకు గల ఉపాధ్యాయులను హాజరుకావాలన్నారు. దీంతో శనివారం ఉదయం 8.30 గంటలకు మిగిలిన 1,182 మంది ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ కౌన్సెలింగ్ హాల్‌కు హాజరయ్యారు. అర్ధరాత్రి దాటినా కౌన్సెలింగ్ కొనసాగుతోంది. అందరికీ పూర్తయ్యేసరికి వేకువజాము 3 గంటలు దాటివచ్చని అధికారులు తెలిపారు.

అలలపై జీవన సమరానికి సై



మత్స్య వేట పునఃప్రారంభం

మహారాణిపేట: 61 రోజుల సుదీర్ఘ విరామం ముగిసింది. మత్స్య సంపద పునరుత్పత్తి కోసం ఏప్రిల్ 14 నుంచి ఈ నెల 14 వరకు విధించిన వేట నిషేధానికి తెరపడింది. శనివారం అర్ధరాత్రితో నిషేధం గడువు ముగియగా.. ఆదివారం ఉదయం నుంచి సముద్రంలో వేట సాగించేందుకు మత్స్యకారులు సన్నద్ధమయ్యారు. దీంతో విశాఖ ఫిషింగ్ హార్బర్ కోలాహలంగా మారింది. విశాఖ కేంద్రంగా ఉన్న మొత్తం 680 మర పడవలకు గానూ సుమారు 400 పడవలు ఆదివారం వేటకు వెళ్లేందుకు సిద్ధమయ్యాయి. ఇందుకోసం బోట్లకు అవసరమైన మరమ్మతులు, ఇంజిన్ గేర్ బాక్సులు, వాటర్ క్యాబిన్లు వంటి వాటిని సరిచేయించుకున్నారు. వలలను బాగు చేసుకొని, ఐస్‌ను సమకూర్చుకున్నారు. కాగా.. వేట సవ్యంగా సాగాలని గత మంగళవారం హార్బర్‌లోని గంగమ్మ తల్లి ఆలయంలో మత్స్యకారులు పూజలు చేసిన సంగతి తెలిసిందే.

వరుణ్ మోటార్స్ కేసులో ఇద్దరు అరెస్టు

గాజువాక: వరుణ్ మోటార్స్‌లో ఆర్థిక మోసం కేసులో గాజువాక పోలీసులు ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేశారు. ఆ సంస్థలో 2020 నుంచి 2025 వరకు అమ్మిన 400 పాత ద్విచక్రవాహనాల కేసులో చోటుచేసుకున్న అక్రమ లావాదేవీలకు సంబంధించి కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే జీఎం వడ్డాది అప్పారావు, ఏఎస్ఎం నారాయణమూర్తిని అరెస్టు చేసిన పోలీసులు ఎ5గా ఉన్న సేనాపతి రవికృష్ణ, ఎ7గా ఉన్న విస్సారపు కొండారావును శనివారం అరెస్టు చేశారు. పాతగాజువాకలో పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నిస్తున్న వారిద్దర్నీ మధ్యవర్తులు మాకిరెడ్డి ప్రసాదరావు, జామి గాంధీ ప్రసాద్ సహకారంతో పట్టుకున్నట్టు గాజువాక సీఐ పార్థసారధి తెలిపారు. ఈ వ్యవహారం జరిగిన సమయంలో బ్రాంచి మేనేజర్‌గా ఉన్న రవికృష్ణ, క్యాషియర్‌గా ఉన్న కొండారావు ద్విచక్ర వాహనాల విక్రయాల్లో అక్రమ లావాదేవీలు నిర్వహించినట్టు, కీలక ఉద్యోగులతో కలిసి డెలివరీ రసీదులను ఫోర్జరీ చేసినట్టు ఒప్పుకున్నారని సీఐ పేర్కొన్నారు. గాజువాక, మాకవరపాలెం, అనకాపల్లి బ్రాంచ్‌ల్లో ఈ మోసానికి పాల్పడినట్టు తెలిపారన్నారు. వారిద్దరు గత కొద్దిరోజులుగా తప్పించుకు తిరుగుతున్నారని పేర్కొన్నారు.

డబుల్ డెక్కర్ రయ్..రయ్..


అల్లిపురం: నగర రోడ్లపై డబుల్ డెక్కర్ ఎలక్ట్రిక్ బస్సు రయ్ రయ్ మంటూ పరుగులు పెట్టింది. శనివారం సాయంత్రం పెందుర్తి నుంచి హనుమంతవాక వరకు బీఆర్‌టీఎస్‌లో వెళ్లిన రెండంతస్తుల బస్సు.. పాదచారులను, వాహన చోదకులను ఎంతగానో ఆకట్టుకుంది. అందరూ బస్సును ఆసక్తిగా తిలకిస్తూ ఫొటోలు తీసుకున్నారు.



కళ్లు మూసుకున్నారా? కావాలనే చేశారా?


- కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై వివక్ష
- అధికారుల నిర్లక్ష్యంతో 37వ వార్డు కార్పొరేటర్‌కు అవమానం


36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీ జోన్స్ పేరును హైలెట్ చేసిన వైనం


37వ వార్డు కార్పొరేటర్ పేరును శ్రీమతి చెన్నా జానకీరామ్‌గా ఉన్న శిలాఫలకం


34వ వార్డులో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై సాధారణంగా కార్పొరేటర్ తోట పద్మావతి పేరు

అల్లిపురం/డాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులను కొనసాగిస్తోంది. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జరిగిన సంఘటనలే ఇందుకు నిదర్శనం. అభివృద్ధి కార్యక్రమాల ముసుగులో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లను లక్ష్యంగా చేసుకుని అవమానించడమే పనిగా పెట్టుకుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు సైతం ఈ రాజకీయ క్రీడలో భాగస్వాములు కావడం దారుణమని మండిపడుతున్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శనివారం దక్షిణ నియోజకవర్గంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇక్కడే కూటమి ప్రభుత్వ వివక్ష ధోరణి స్పష్టంగా బయటపడింది. 36వ వార్డులో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలోకి చేరిన కార్పొరేటర్ మేరీ జోన్స్ పేరును, 33వ వార్డు జనసేన కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి పేరును ప్రముఖంగా ముద్రించారు. 34వ వార్డులో జరిగిన శంకుస్థాపనలో అక్కడి వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ తోట పద్మావతి పేరును మాత్రం శిలాఫలకంపై నామమాత్రంగా, ఎలాంటి ప్రాధాన్యత లేకుండా ముద్రించారు. పార్టీ మారిన వారికి ఒక న్యాయం, ప్రతిపక్షంలో ఉన్న వారికి మరో న్యాయమా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇది ఒక ఎత్తయితే.. 37వ వార్డులో జరిగిన ఘటన మరో ఎత్తు. ఇక్కడ సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంపై అక్కడి కార్పొరేటర్, పురుషుడైన చెన్నా జానకీరామ్ పేరుకు ముందు 'శ్రీమతి' అని ముద్రించడం తీవ్ర దుమారాన్ని రేపింది. ఒక ప్రజా ప్రతినిధిని ఇంత దారుణంగా అవమానించడం వెనుక అధికారుల తప్పిదమా లేక కూటమి నేతల దుర్బుద్ధి దాగి ఉందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులందరూ సమానమేనని.. వారి పార్టీ ఏదైనా గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, అధికారులపై ఉంటుందని ప్రజలు హితవు పలుకుతున్నారు. ఈ తరహా చౌకబారు రాజకీయాలు మానుకుని.. అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.



స్టీల్‌ప్లాంట్ అమ్మడం లేదని ప్రధాని ప్రకటించాలి

- ఈ నెల 16 నుంచి 21 నిరసనలు
- కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ప్రకటన

డాబాగార్డెన్స్: నగరానికి వస్తున్న ప్రధాని మోదీ.. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించాలని జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. అన్యాయంగా తొలగించిన 4,000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ ఉక్కు నిరాహారదీక్ష శిబిరంపై ప్రభుత్వ, పోలీసు నిర్బంధాన్ని ఆపాలని జేఏసీ డిమాండ్ చేసింది.

దీక్ష శిబిరంపై ఆంక్షలు దారుణం : సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్లు ఎం.మన్మథరావు, బి.నాగభూషణం, ఎస్.కనకారావు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం నాలుగున్నరేళ్లుగా కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్ష శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. అధికారంలో ఎవరున్నా పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు ఈ శిబిరంలో పాల్గొన్నారని, ప్రస్తుత గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా దీక్షలు చేశారని గుర్తు చేశారు. శిథిలమైన ఈ శిబిరాన్ని పునర్నిర్మించేందుకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పూనుకుంటే.. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను పంపి అడ్డుకుంటోందని జేఏసీ నేతలు ఆరోపించారు. శిబిరంలో కూర్చోకుండా శాశ్వత, కాంట్రాక్టు కార్మికులను బెదిరించి కేసులు పెడతామని హెచ్చరించడం కార్మికుల హక్కును కాలరాయడమేనన్నారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోండి

స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 4,000 మంది కాంట్రాక్టు కార్మికులను నిర్దాక్షిణ్యంగా, చట్ట విరుద్ధంగా తొలగించారని, వీరందరూ మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్నవారేనన్నారు. వీరిని తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని ఎలా నియమిస్తారని జేఏసీ నేతలు ప్రశ్నించారు. టీఎంసీ పేరుతో పెద్ద ప్రైవేట్ సంస్థలను రంగంలోకి తెచ్చి.. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను నియమించి దోపిడీ చేయడానికి సిద్ధపడుతున్నారని ఆరోపించారు. అక్రమ తొలగింపులను వెంటనే నిలిపివేసి, 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి.. మోదీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 16 నుంచి 21 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జేఏసీ నిర్ణయించింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్.కె.రెహమాన్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కె. దేవ సహాయం, ఐద్వా జిల్లా అధ్యక్షులు బి. పద్మ, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు యు.ఎస్.ఎన్. రాజు, డి. ఉమామైలజ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె. నాయుడు పాల్గొన్నారు.

ఆశలు తీరకుండానే.. అనంతలోకాలకు..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నేవీ అధికారుల దుర్మరణం


ఘటనా స్థలంలోనే మృతి చెందిన నేవీ అధికారులు

జగదాంబ: విధి వక్రించింది. శనివారం సాయంత్రం కాన్వెంట్ జంక్షన్ వంతెన సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నేవీ యువ అధికారులు ప్రాణాలు కోల్పోయారు. సౌమ్య సతీష్ అసాతి (35), మేఘా రావత్ (30) అనే ఇద్దరు అధికారులు షీలానగర్ నుంచి నగరానికి తమ బైక్‌పై వస్తుండగా.. కాన్వెంట్ జంక్షన్ వద్ద ఎదురుగా దూసుకొచ్చిన ఆయిల్ ట్యాంకర్ వారి జీవితాలను విషాదంలో ముంచేసింది. ట్యాంకర్‌ను తప్పించుకునే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి నేరుగా దాని కింద పడింది. నిమిషాల వ్యవధిలోనే వారి కలలు, ఆశలు చిన్నాభిన్నమైపోయాయి. ఈ ప్రమాదంలో వారి శరీరం ఛిద్రమై, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆ దృశ్యం చూసిన వారికి గుండె తరుక్కుపోయింది. సమాచారం అందుకున్న హార్బర్ స్టేషన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, ఈ దుర్ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దేశ సేవలో నిమగ్నమైన యువ అధికారులు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం అందరినీ కలచివేసింది. వారి కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చింది.

మూడో ఫ్లోర్ నుంచి జారిపడి సెక్యూరిటీ గార్డు దుర్మరణం


సానాసి వెంకటరావు(ఫైల్)

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస కేబీఆర్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న సెక్యూరిటీ గార్డు సానాసి వెంకటరావు(53) శనివారం మధ్యాహ్నం మూడో ఫ్లోర్ నుంచి పడి దుర్మరణం చెందాడు. అక్కడ సెక్యూరిటీ గార్డు మృతుని భార్య, భీమిలి పోలీసులకు సమాచారం అందించాడు. స్థానిక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మృతుడు ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీలో సెక్యూరిటీ గార్డుగా, భార్య సుగుణ కేజీహెచ్‌లో స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తెకు వివాహమై పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో ఉండగా రెండో కుమార్తె సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదువుతుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ యు.నూకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీట్‌లో మెరిశారు

నీట్–2025 ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య సమస్యలను కళ్లారా చూసిన విద్యార్థులు.. వైద్యులు కావాలనే లక్ష్యంతో చదివి.. అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. పట్టుదల, క్రమశిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల కృషితో విజయం సాధించారు.

– సాక్షి బృందం

న్యూరాలజిస్ట్‌నవుతా..



పట్టుదలతో చదివాను. తండ్రి రైతు. తల్లి గృహిణి. మాది పాయకరావుపేట. ప్రతి రోజూ 12 నుంచి 13 గంటల పాటు చదివాను. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు చూశాను. మంచిగా చదివి న్యూరాలజిస్ట్ అవుతాను. పేద ప్రజలకు సేవలందిస్తా. ఈ విజయం వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు అధ్యాపకుల కృషి ఎంతో ఉంది. ఈఏపీసెట్–2025లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 10వ ర్యాంకు వచ్చింది.

–దేసిన సూర్య చరణ్, ఆలిండియా 59వ ర్యాంకు

అంకాలజిస్ట్ అవుతా..



మా నాన్న ధర్మారావు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, తల్లి గృహిణి. మాది ఒడిశా. ప్రతి రోజూ 12 నుంచి 13 గంటల పాటు చదివా. వైద్య విద్యనభ్యసించి మంచి డాక్టర్‌గా కావాలన్నదే నా ఆకాంక్ష. అంకాలజిస్ట్ అయి సేవలందిస్తా. ర్యాంకు రావడంలో అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది. ఈఏపీసెట్–2025లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 75వ ర్యాంకు వచ్చింది.

–యర్రా సమీర్‌కుమార్, ఆలిండియా 70వ ర్యాంకు

నారాయణ ప్రభంజనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యా సంస్థల డీజీఎం హనుమంతరావు

డాబాగార్డెన్స్: నీట్–2025 ఫలితాల్లో విశాఖపట్నం నారాయణ విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. నీట్ ఆలిండియా ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని సంస్థ డీజీఎం డి.హనుమంతరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ కేటగిరీల్లో నారాయణ విద్యార్థులు 17, 45, 172, 232, 294, 532, 585, 979, 996 వంటి ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ఓపెన్ కేటగిరీలో సూర్య చరణ్ 59వ ర్యాంక్, యర్రా సమీర్ కుమార్ 70వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

శ్రీచైతన్య విజయదుందుభి


ప్రతిభ చూపిన విద్యార్థులతో కాలేజీ నిర్వాహకులు

విశాఖ విద్య: నీట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో పి.అవినాష్ 64వ ర్యాంకు, కె.నిధి 116, టి.శ్రీనిధి 238, డి.జాహ్నవి 358, ఎం.జయదీప్ 672, జి. లక్ష్మీచరణ్ 875వ ర్యాంకులు సాధించారు. విశాఖపట్నం మెడికల్ అకాడమీ నుంచి 368 మందికి పైగా మెడికల్ సీట్లు పొందేలా ర్యాంకులు సాధించారని ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎగ్జిక్యూటివ్ డీన్లు కె.బంగారు బాబు, ఎస్.రఘుకుమార్, వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల విద్యార్థుల ఉత్తమ ప్రతిభ


రిషిత సరయు


రామిరెడ్డి వరలక్ష్మి

తగరపువలస: నీట్–2025 ఫలితాల్లో తాళ్లవలస తిరుమల విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఈ వివరాలను వెల్లడించారు. వివిధ కేటగిరీల్లో నాగిరెడ్డి రిషిత సాయి సరయు 6,653వ ర్యాంకు, రామిరెడ్డి వరలక్ష్మి 7,560వ ర్యాంకు, ఎం. ప్రియ 9,119వ ర్యాంకు సాధించారు. 10వేల లోపు ర్యాంకులు ముగ్గురికి, 15 వేల లోపు ఏడుగురికి, 20వేల లోపు 11 మందికి, 30వేల లోపు 19 మందికి, 50వేల లోపు 35 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని వెల్లడించారు. మొత్తంగా 40 మందికి పైగా ఎంబీబీఎస్ సీట్లు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, డైరెక్టర్లు ఇ.మృత్యుంజయరావు, కె.ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, జి.సతీష్ బాబు, అధ్యాపకులను అభినందించారు.

శశి విద్యార్థుల సత్తా


ఆర్.ప్రతిభ


ఆర్ఎంఎస్ కుమారి

తగరపువలస: నీట్–2025 ఫలితాల్లో సంగివలసలోని శశి విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ వివరాలు వెల్లడించారు. జనరల్ కేటగిరీలో ఆర్.ప్రతిభ ఆలిండియాలో 535వ ర్యాంకు, వివిధ కేటగిరీల్లో ఆర్ఎంఎస్ కుమారి 1,436, జె.స్వర్ణరేఖ 2,217, పి.యశస్విని 4,171, సీహెచ్ రేష్మి 5,145, ఎం.గౌతంరాజు 6,394, టి.కావ్యశ్రీ 10,110 ర్యాంకులు సాధించారన్నారు. 5వేల లోపు ర్యాంకులు నలుగురికి, 10వేల లోపు ఆరుగురికి, 30వేల లోపు 12 మందికి, 50 వేల లోపు 20 మందికి ర్యాంకులు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

ఎసెంట్‌కు ఉత్తమ ర్యాంకులు


భార్గవ్‌ను అభినందిస్తున్న ఎసెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ

మద్దిలపాలెం: నీట్–2025 ఫలితాల్లోనూ ఎసెంట్ తన హవాను కొనసాగించింది. జాతీయ స్థాయిలో రిజర్వ్ కేటగిరీలో మల్రాపు తులసీ భార్గవ్ 55వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 211వ ర్యాంకు సాధించినట్లు సంస్థ డైరెక్టర్ ఎం.వి.ఆర్.మురళీకృష్ణ తెలిపారు. అన్ని కేటగిరీల్లోనూ తమ విద్యార్థులు 402, 905, 1,582, 1,742, 1,782, 2,171, 2,190, 2,742, 2,956 తదితర ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. మొదటి బ్యాచ్‌లోనే అతి తక్కువ మంది విద్యార్థుల నుంచి ఎక్కువ ర్యాంకులు సాధించామని, ఒకే ఒక్క క్యాంపస్ నుంచి 100 మందికి పైగా విద్యార్థులు సీటు పొందే ర్యాంకులను సాధించినట్లు చెప్పారు. దీని వెనుక డైరెక్టర్లు, అధ్యాపక బృందం కృషి, పట్టుదల ఉన్నాయని వివరించారు.

శ్రీవిశ్వ విజయకేతనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులు

సీతంపేట: నీట్–2025 ఫలితాల్లో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. వివిధ కేటగిరీల్లో గుంటుకు గురు చరణ్ 207వ ర్యాంకు, జామి గిరిజ 425, డి.అజయ్ 1,865, ఎం.లక్ష్మిరాజు 2,228, ఎస్. హర్షవర్ధన్ 2,856, డి.వివేక్ 3,260, టి.కావ్య ప్రవల్లిక 5,180వ ర్యాంక్ సాధించినట్లు వెల్లడించారు. మొత్తంగా వెయ్యిలోపు ర్యాంకులు ఇద్దరు విద్యార్థులు సాధించగా, 5 వేల లోపు 8, 10 వేల లోపు 16 మంది ర్యాంకులు సాధించారు. దాదాపు 131 మందికి పైగా విద్యార్థులు సీటు పొందే ర్యాంకులను సాధించినట్లు వారు వెల్లడించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

అప్పన్నను దర్శించుకున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం సందీప్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ శనివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రం ఏఈవో పిల్లా శ్రీనివాసరావు అందజేశారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	:రూ.83
బ్రాయిలర్ (లైవ్)	:రూ.103
స్కిన్	:రూ.176
స్కిన్‌లెస్	:రూ.186

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00